సాక్షి
ఖమ్మం

శనివారం, 2, మార్చి, 2024



పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

ఆస్తిపన్ను బకాయిలను ఈనెల 31లోగా ఒకేదఫా చెల్లిస్తే వడ్డీపై 90శాతం రాయితీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 8లో



రిజిస్ట్రేషన్ ఆపేయాలని నిరసన

తమ భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఆరోపిస్తూ రఘునాథపాలెం తహసీల్‌లో తండ్రీకుమారులు నిరసన తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
37° / 21°

వాతావరణం

జిల్లాలో శనివారం ఎండల ప్రభావం ఉంటుంది. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాకు ఎంపీ నిధులు

201 పనులకు రూ.9.38 కోట్లు మంజూరు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 218 అభివృద్ధి పనులకు రూ.9.80 కోట్లతో ప్రతిపాదనలు పంపగా, ఇప్పటివరకు 201 పనులకు రూ.9.38 కోట్లు మంజూరయ్యాయని బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తన పదవీ కాలంలో వంద శాతం ఎంపీ నిధులను సద్వినియోగం చేశానని పేర్కొన్నారు. మంజూరైన నిధులను సీసీ రోడ్లు, కల్వర్టులు, పాఠశాల, పీహెచ్‌సీ, అంగన్‌వాడీ భవనాల ప్రహరీల పనులకు వెచ్చించనున్నట్లు తెలిపారు.

రేపు జిల్లాలో పల్స్ పోలియో

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమానికి వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాట్లు పూర్తిచేసింది. బూత్‌ల ద్వారా ఆదివారం పిల్లలకు పోలియో చుక్కలు వేయనుండగా, ఆతర్వాత రెండు రోజులు ఇంటింటికీ వెళ్లి మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారు. రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయనుండగా, జిల్లాలో 1,00,297 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. పోలియో చుక్కలు వేసేందుకు 4,984 మంది బూత్ టీమ్ సభ్యులు, 70 మొబైల్ టీంలను ఏర్పాటు చేశారు. అలాగే, రూట్ సూపర్‌వైజర్లు, ట్రాన్సిట్ టీమ్‌లతో కలిపి 5,369 మంది ఉద్యోగులు ఈ కార్యక్రమానికి కేటాయించారు. కాగా, 1.60లక్షల పోలియో చుక్కల డోస్‌లు సిద్ధం చేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలోని 70 కేంద్రాల్లో 19,133మంది విద్యార్థులకు గాను 18,284 మంది హాజరు కాగా 849మంది గైర్హాజరయ్యారు. కాగా, నగరంలోని నయాబజార్ కళాశాల, రిక్కాబజార్ హైస్కూల్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ గౌతమ్ తనిఖీ చేశారు. అలాగే, డీఐఈఓ రవిబాబు సహా హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్ ఉద్యోగులు 38పరీక్షా కేంద్రాల్లో పరిశీలించారు.

ప్రారంభమైన రేషన్ బియ్యం పంపిణీ



జలగంనగర్‌లో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారుడు

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వం పేదలకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన ఇచ్చే బియ్యం పంపిణీ శుక్రవారం ప్రారంభమైంది. గత నెల చివరి నుంచే రేషన్ దుకాణాలకు బియ్యం చేరవేయగా, 1వ తేదీనే పంపిణీ ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో శుక్రవారం రేషన్ షాపులు తెరిచి లబ్ధిదారులకు బియ్యం పంపిణీని మొదలుపెట్టినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, జిల్లాలో 748రేషన్ దుకాణాలు ఉండగా, 4,11,315 రేషన్ కార్డులకు గాను సుమారు 10వేల మంది తొలిరోజు బియ్యం తీసుకెళ్లారని వెల్లడించారు.

పాలేరు కాల్వ గేట్ల వద్ద సీసీ కెమెరాల నిఘా



పాలేరు కాల్వ వద్ద బిగించిన సీసీ కెమెరా

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ పాత కాల్వ గేట్ల వద్ద జలవనరులశాఖ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇటీవల పాత కాల్వకు సాగు నీరు వదలాలని రైతులు రెండు సార్లు ఆందోళనకు దిగారు. ఇదేసమయంలో రైతులే నేరుగా నీరు విడుదల చేశారు. అయితే, రైతులు పెద్దసంఖ్యలో ఆందోళనకు దిగుతుండడం, వీరికి వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలుపుతుండడంతో గుర్తించడం సాధ్యమవుతోంది. దీనికి తోడు రాత్రి సమయాన గేట్లు ఎత్తినా అడ్డుకునే పరిస్థితి లేకపోవడంతో కలెక్టర్ గౌతమ్ ఆదేశాలతో గేట్ల వద్ద శుక్రవారం సీసీ కెమెరాలు బిగించారు. వీటి ఫుటేజీని కలెక్టరేట్ నుంచి నేరుగా చూసేలా యాప్‌కు అనుసంధానించారు.

నీటికి ధోకా లేకుండా..

వేసవి ముంచుకొస్తుంది... అయితే, ఎండలు ఇంకా ముదరకముందే జిల్లాలో భూగర్భజలాలను అడుగంటుతున్నాయి. దీంతో పల్లెల్లో నీటి ఎద్దడి తరుముకొస్తుండగా... ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రంగంలోకి దిగారు. అధికారులు మొదలు సిబ్బంది వరకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తితే అక్కడిక్కడే సమస్య పరిష్కరించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే కొన్ని చోట్ల



సమస్య ఎదురవగా, బావులను అద్దెకు తీసుకుని ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే, జిల్లాలో కీలకమైన పాలేరు, వైరా జలాశయాల్లో నీరు అడుగంటుతుండగా.. సాగర్ నుంచి ఇప్పటికిప్పుడు నీరు విడుదల చేసే అవకాశాలు కనిపించడం లేదు. మరోపక్క భూగర్భజలాలు పాతాళానికి పడిపోతుండడంతో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడడంపై అధికారులు దృష్టి సారించారు.

– ఖమ్మంవన్‌టౌన్



చేతి పంపునకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్) కామేపల్లిలో అద్దెకు తీసుకునేందుకు బావిని పరిశీలిస్తున్న ఈఈ పుష్పలత (ఫైల్)

వేసవిలో తాగునీటి ఎద్దడిపై కార్యాచరణ

- ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించిన అధికారులు
- బోర్ల మరమ్మతు, అద్దెకు బోర్లు, బావుల గుర్తింపు
- 178 సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక పర్యవేక్షణ

పాలేరులోనే ఎక్కువ 'సమస్య'

జిల్లాలో తాగునీటి విషయమై 178 గ్రామాలను సమస్యాత్మకంగా అధికారులు గుర్తించారు. ఇందులో పాలేరు నియోజకవర్గంలో అత్యధికంగా 45 గ్రామాలు ఉన్నాయి. అలాగే, ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలంలో 25 గ్రామాలు, వైరా నియోజకవర్గంలో 37 గ్రామాలు, సత్తుపల్లి నియోజకవర్గంలో 37 గ్రామాలు, మధిర నియోజకవర్గంలో 34 గ్రామాలు ఉన్నట్లు తేలింది.

పని చేయని బోర్లు

కొన్నేళ్లుగా గ్రామాల్లో చేతి బోర్ల వినియోగం తగ్గిపోయింది. నీటి సమస్య ఎదురుకాకపోవడంతో వీటి వాడకం తగ్గగా చాలా వరకు పనిచేయడం లేదు. జిల్లాలోని 969 గ్రామాల్లో మొత్తం 10,377 చేతిపంపులు ఉన్నాయి. ఇందులో 7614 చేతిపంపులు వాడుకలో ఉండగా, మిగతా 2,763 పనిచేయడం లేదు. దీంతో కొన్నాళ్లుగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనిచేయని బోర్లకు మరమ్మతు చేయిస్తున్నారు. అలాగే, పంపు సెట్లకు మరమ్మతు చేయించి ప్యానల్ బోర్డులను సైతం సిద్ధం చేశారు. తద్వారా తరుముకొస్తున్న నీటిఎద్దడిపై యుద్ధం ప్రకటించారు.

బోర్లు, బావులు అద్దెకు...

తాగునీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కార్యాచరణ రూపొందించిన అధికారులు అందుకు అనుగుణంగా ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే పనిచేయని బోర్లను వాడుకలోకి తీసుకొస్తున్నారు. అలాగే, తీవ్ర నీటిఎద్దడి ఎదురయ్యే గ్రామాల్లో అవసరమైతే రైతుల నుంచి బావులు, బోర్లను అద్దెకు తీసుకుని ప్రజలకు తాగునీరు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈమేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కొన్ని బావులు, బోర్లను గుర్తించారు. కాగా, గుర్తించిన పనులు చేయడంతో పాటు రైతులకు అద్దె చెల్లించేందుకు రూ.4.83 కోట్లు కేటాయించినట్లు సమాచారం.

అధికారులంతా క్షేత్రస్థాయిలోనే...

ఆర్‌డబ్ల్యూస్ అధికారులు అందరూ తాగునీటి ఎద్దడిపై యుద్ధం ప్రకటించినట్లుగా క్షేత్రస్థాయిలోనే పర్యటిస్తున్నారు. జిల్లాలోని969 గ్రామాల్లో ఎక్కడ నీటి సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు సిద్ధమయ్యారు. అలాగే, క్లోరినేషన్‌కు సైతం పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఖమ్మం, వైరా, మధిర, సత్తుపల్లి నాలుగు సబ్ డివిజన్లలో ఇప్పటికే కొన్నిచోట్ల తాగునీటి సమస్యలు తలెత్తగా పరిష్కరించారు. కల్లూరు మండలం ఎర్రబోయినపల్లిలో, చిన్నకోరుకొండి, వేంసూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయంగా బావులు, బోర్లు అద్దెకు తీసుకుని సరఫరా పునరుద్ధరించారు.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం...



వేసవిని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటికే గ్రామాల్లో సర్వే చేపట్టాం. చేతిపంపులు, పంపు సెట్ల పనితీరు పరిశీలించి పనిచేయని బోర్లకు మరమ్మతు చేయిస్తున్నాం. అవేమీ లేనిచోట రైతుల నుంచి బావులు, బోర్లు అద్దెకు తీసుకుని ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తాం.

– పుష్పలత, మిషన్ భగీరథ ఈఈ

ఖాళీ సీట్ల భర్తీకి రేపు ప్రవేశపరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ బీసీ గురుకులాల్లో 6, 7, 8వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈ నెల 3న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ టి.అంజలి తెలిపారు. ఈ మేరకు విద్యార్థుల నుంచి 2,573 దరఖాస్తులు అందగా, పరీక్ష నిర్వహణకు 11 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని హాజరుకావాలని సూచించారు.

చెప్పినవన్నీ చేసేస్తాం..



గోకినేపల్లిలో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన కలెక్టర్ గౌతమ్, ప్రజాప్రతినిధులు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ముదిగొండ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- 'గృహలక్ష్మి' ద్వారా జీరో విద్యుత్ బిల్లులు జారీ

ముదిగొండ: చేయగలిగేవే చెప్పడం.. చెప్పినవన్నీ చేయడం కాంగ్రెస్ నైజమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ముదిగొండ మండలంలోని కట్టకూరు నుంచి సీతారాంపురం వరకు రూ.220కోట్లతో, గోకినేపల్లి నుంచి మేడేపల్లి వరకు రూ.375 కోట్లతో నిర్మించే బీటీ రహదారులతో పాటు గోకినేపల్లి నుంచి కట్టకూరు వరకు 9కి.మీ. మేర రహదారి పనులకు భట్టి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అలాగే, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కాగా, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి ముదిగొండ మండలానికి వచ్చిన భట్టికి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. సీతారాంపురంలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేసిన ఆయన, సీతారాంపురం, గోకినేపల్లిల్లో నాయకులు కందిమళ్ల వీరబాబు, కొమ్మినేని రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన సభల్లో మాట్లాడారు.

హామీలన్నీ అమలుచేసి తీరుతాం

ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారంటీలు తప్పక అమలుచేసి తీరుతామని భట్టి విక్రమార్క వెల్లడించారు. గతంలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడమే కాక రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచామని తెలిపారు. తాజాగా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించే పథకాలకు శ్రీకారం చుట్టామన్నారు. తనను గెలిపించిన మధిర నియోజకవర్గ ప్రజల ఓటుకు గౌరవం తెచ్చేలా పనిచేస్తామని భట్టి తెలిపారు. రాష్ట్ర ప్రజల కోసం ప్రభుత్వంలోని మంత్రులంతా కంకణబద్ధులై పనిచేస్తున్నారని చెప్పారు. ఉద్యోగులను గత ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేయగా.. తాము వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా వడ్డీ లేని రుణాలను అందిస్తామని చెప్పారు. కాగా, ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే 25వేల ఉద్యోగాలు భర్తీ చేయగా.. గ్రూపు-1, డీఎస్సీ నోటిఫికేషన్లు కూడా విడుదల చేశామని తెలిపారు. కాగా, బీటీ రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని హెచ్చరించిన భట్టి... నాణ్యత లోపిస్తే ప్రజలు ఫిర్యాదు చేయాలని సూచించారు.



ఉచిత విద్యుత్‌కు సంబంధించి జీరో బిల్లును పరిశీలిస్తున్న భట్టి

ఉచిత విద్యుత్ ప్రారంభం

ముదిగొండలో పర్యటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వల్లభి రోడ్డులో ఇద్దరి ఇళ్లలో స్వయంగా సెల్‌ఫోన్ యాప్‌లో రీడింగ్ నమోదు చేసిన మంత్రి జీరో బిల్లులు అందజేశారు. ఈకార్యక్రమంలో టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జెడ్పీటీసీ పసుపులేటి దుర్గ, ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, ఎంపీటీసీలు ఆదినారాయణరెడ్డి, యరబోలు బిచ్చెమ్మ, మాజీ జడ్పీటీసీ బాబుతో పాటు పసుపులేటి దేవేంద్రం, గుడిపూడి ఝాన్సీరాణి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

ఖమ్మంక్రైం: ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. ఖమ్మంలో ట్రాఫిక్ పరిస్థితిపై శుక్రవారం ఆయన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, అందుకు కారణాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. తాత్కాలిక పరిష్కారం కాకుండా దీర్ఘకాలిక పరిష్కారానికి చర్యలు తీసుకుంటేనే వాహనదారులకు ఊరట లభిస్తుందని తెలిపారు. వాహనదారులకు ఇబ్బందిగా మారుతున్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐ మోహన్‌రావు, ఎస్‌ఐ రవి తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ సునీల్‌దత్

రేపు 'యూనిటీ' మహాసభ

- మూడు పార్టీల విలీనంతో 'మాస్‌లైన్' ఏర్పాటు
- దేశ, విదేశాల నుంచి హాజరుకానున్న ప్రతినిధులు
- నాయకులు ప్రదీప్ సింగ్ ఠాగూర్, పోటు రంగారావు, సుభాష్ దేవ్ వెల్లడి



మాట్లాడుతున్న ప్రదీప్ సింగ్, పక్కన పోటు రంగారావు తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఒక అవగాహనతో మూడు విప్లవ పార్టీలు విలీనమై సీపీఐ(ఎంఎల్)గా ఏర్పడుతున్న సందర్భంగా ఖమ్మం కేంద్రంగా ఈనెల 3న యూనిటీ మహాసభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) ఆర్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్ తెలిపారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎంఎల్) ఆర్‌ఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్) మూడు పార్టీలు ఒక అవగాహనతో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్‌గా ఏర్పడనున్నాయని తెలిపారు. ఇప్పటికే పలుమార్లు చర్చించి సైద్ధాంతిక అంశాల్లో అవగాహనకు వచ్చినట్లు పేర్కొన్నారు. మూడు పార్టీలు జాతీయ పార్టీగా ఏర్పడడంతో పాటు దేశానికి ప్రమాదకారిగా మారిన బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిజాన్ని ఓడించాలనేదే లక్ష్యమని తెలిపారు. కాగా, ఖమ్మంలో జరిగే మహాసభలకు ఇతర దేశాలతో పాటు భారత్‌లోని 16 రాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరవుతారని, వీరితో పాటు దేశంలోని ఏడు సోదర పార్టీల ప్రతినిధులు, మేధావులు పాల్గొంటారని చెప్పారు. పీసీసీ సీపీఐ(ఎంఎల్) జాతీయ కార్యదర్శి సుభాష్ దేవ్ మాట్లాడుతూ ఎంఎల్ పార్టీ నుండి విడిపోయి కొత్త పార్టీలుగా ఏర్పడిన మూడు విప్లవ పార్టీలు ఖమ్మం వేదికగా విలీనం కాబోతున్నాయని తెలిపారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ విప్లవ పార్టీల విలీనం సందర్భంగా ఈనెల 3న ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానం వద్ద 30 వేల మందితో మొదలయ్యే భారీ ప్రదర్శన పెవిలియన్ మైదానానికి చేరుకోనుండగా, అక్కడ బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. అలాగే, 4, 5వ తేదీల్లో ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రతినిధుల సభలు జరుగుతాయని, ఈ సభలకు 16 రాష్ట్రాల నుండి ఎంపికచేసిన 300 మంది ప్రతినిధులు హాజరవుతారని రంగారావు వివరించారు. కాగా, జర్మనీ నుండి ఎంఎల్ పీడీ పార్టీ ప్రతినిధులు, నేపాల్, ఇతర దేశాల నుండి కూడా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఖమ్మం వేదికగా జరిగే సభ చరిత్రాత్మకంగా నిలవనుండగా.. పలు తీర్మానాలను ఆమోదించి జాతీయ కమిటీని ఎన్నుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు కే.జీ.రామచందర్, కె.రమ, గోకినేపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతుల కన్నెర్ర

- ధరలో దగా చేస్తున్నారని మండిపాటు
- జెండా పాటతో పోలిస్తే రూ.4వేలకు పైగా తగ్గించారని ఆందోళన
- ఖమ్మం మార్కెట్ ఎదుట నాలుగు గంటల పాటు నిరసన



వ్యవసాయ మార్కెట్‌లో ఆందోళనకు దిగిన రైతులు

ఖమ్మంవ్యవసాయం: ధరలో దగా పడిన మిర్చి రైతులు కన్నెర్ర చేశారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి పొంతన లేని ధరతో మోసం చేస్తున్నారంటూ శుక్రవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఎదుట ఆందోళనకు దిగారు. జెండాపాటను పేరుకే నిర్వహిస్తూ ఆతర్వాత ఇష్టారాజ్యంగా ధర చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు నాలుగు గంటల పాటు రైతులు ఆందోళన చేయగా... ఉన్నతాధికారులు చేరుకుని చర్చలు జరపడంతో సమస్య పరిష్కారమైంది.


జెండాపాటతో పొంతన లేని ధరలు

ఖమ్మం మార్కెట్‌కు శుక్రవారం 70వేలకు పైగా మిర్చి బస్తాలు వచ్చాయి. రోజులాగే ఉదయం జెండా పాట నిర్వహించగా ఇద్దరు, ముగ్గురు వ్యాపారులే వచ్చారు. మిర్చి క్వింటాకు గరిష్టంగా రూ.20,800 ధర నిర్ణయించడంతో రైతులంతా అటూఇటు ఇదే ధర లభిస్తుందని ఆశించారు. కానీ వ్యాపారులు పంటను పరిశీలించి రూ.14 వేల నుంచి రూ. 16 వేల వరకే ధర ప్రకటించడంగా రైతులు ఆగ్రహంతో మార్కెట్ ప్రధాన గేట్ ముందు ఆందోళనకు దిగారు. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తమను మోసం చేస్తున్నారని ఆరోపించగా... మార్కెట్ అధికారులు నచ్చచెప్పినా వినలేదు. చివరకు అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇస్తూ రైతులను యార్డులోకి తీసుకువెళ్లారు. అక్కడ అదనపు కలెక్టర్, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి ప్రవీణ్‌కుమార్ తదితరులు వ్యాపారులతో చర్చించారు. జెండా పాట ధరతో పొంతన లేకుండా కొనుగోళ్లు చేయడం ఏమిటని ప్రశ్నించగా.. పంట నాణ్యత, తమకు ఉన్న ఆర్డర్ల ఆదారంగానే ధర నిర్ణయిస్తున్నామని బదులిచ్చారు. అయితే, ధరలో వ్యత్యాసం ఎక్కువగా ఉండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమైనందున జెండాపాటలో వ్యాపారులంతా పాల్గొనాలని అదనపు కలెక్టర్ సూచించారు. మరోసారి పంట పరిశీలించి ధర నిర్ణయించాలని సూచించగా.. వ్యాపారులు యార్డులో పరిశీలించి కొంత ధర పెంచి కొనుగోళ్లు చేశారు. దీంతో ఉదయం 7–30గంటలకు మొదలైన ఆందోళన 11–30గంటలకు ముగిసింది. ఈమేరకు ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు మార్కెట్‌లో భారీగా మొహరించారు. అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, ఉద్యాన శాఖ అధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆందోళనపై మంత్రి తుమ్మల సమీక్ష

ఖమ్మం వ్యవసాయం/ ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం మార్కెట్‌లో శుక్రవారం మిర్చి ధర తగ్గిందంటూ రైతులు చేపట్టిన ఆందోళనపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. ఈమేరకు హైదరాబాద్‌లో మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయితో సమావేశమైన ఆయన ఆందోళనకు కారణాలపై ఆరా తీశారు. మొత్తం సరుకులో 4శాతం నుంచి 5 శాతం వరకు తేమ, నాణ్యత కారణాలతో ధర తగ్గగా రైతులు ఆందోళన చేశారని ఆమె తెలిపారు. అయితే, అధికారులు చర్చించి సమస్య పరిష్కరించారని చెప్పగా.. మంత్రి అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించగా, మార్కెట్లలో గందరగోళం నెలకొనకుండా పర్యవేక్షించాలని సూచించారు.

నాణ్యతగా ఉన్నా రూ.16 వేలకు అడిగారు



21 బస్తాల మిర్చి తీసుకొచ్చా. మిర్చి నాణ్యతగా ఉండడంతో క్వింటాకు కనీసం రూ.20 వేలకు పైగా ధర వస్తుందని భావించా. కానీ వ్యాపారులు జెండాపాటతో పోలిస్తే రూ.5వేలు తగ్గించి రూ.16 వేలకు అడిగారు. దీంతో ఏం చేయాలో పాలుపోలేదు.

– మోతీలాల్, ఉప్పలచెలక, కొణిజర్ల మండలం

సిండికేట్‌గా ఏర్పడి ధరలో మోసం



వ్యాపారులు ఏకమై ధరలో మోసం చేస్తున్నారు. పేరుకే జెండాపాట నిర్వహిస్తున్నారు. పంట కొనే సమయాన ఆ ధరతో సంబంధం ఉండటం లేదు. తేమ ఎక్కువగా ఉందని, నాణ్యత లేదంటూ నేను తీసుకొచ్చిన మిర్చి క్వింటాకు రూ.15వేల ధరే ఖరారు చేశారు.

– కె.వెంకటేశ్వర్లు, ఎర్రబోడు, కారేపల్లి మండలం

క్లుప్తంగా

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్


వివరాలు తెలుసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ విధానాన్ని పరిశీలించారు. అలాగే, రిజిస్ట్రేషన్ శాఖ కార్యకలాపాలపై అధికారుల నుండి తెలుసుకున్నారు. అసిస్టెంట్ కలెక్టర్‌తో జిల్లా రిజిస్ట్రార్ చిట్టిమళ్ల అశోక్‌కుమార్, జిల్లా ఆడిట్ విభాగం అధికారి అడపా రవీంద్రబాబు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు పద్మ, జ్యోతి సమావేశమై పలు వివరాలు వెల్లడించారు.

హోటల్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ


కూరలు పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని పాత బస్టాండ్ సమీపాన అర్జున్ హోటల్‌లో జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ హోటల్‌లో ఆహారం నాసిరకంగా ఉందంటూ ఓ వ్యక్తి కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ చేసి శాంపిళ్లు సేకరించారు. హోటళ్లలో ఆహారం తయారీకి వాడే సరుకుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యూఎస్‌లో పీహెచ్‌డీ.. రూ.2 లక్షల స్కాలర్‌షిప్


ఉషస్వి

తల్లాడ: తల్లాడ మండలం మల్లవరానికి చెందిన రాయల తేజస్వి అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ డల్లాస్‌లో పీహెచ్‌డీ సీటు సాధించింది. ఆమె తండ్రి రామకృష్ణ మెదక్ ఉద్యానవన శాఖాధికారిగా పనిచేస్తుండగా తల్లి లక్ష్మీ గృహిణి. కాగా, ఉషస్వి ప్రాథమిక విద్య నుంచే ప్రతిభ కనబరుస్తూ యూఎస్‌లో నెలకు రూ.2లక్షల స్కాలర్ షిప్‌తో పీహెచ్‌డీతోపాటు టీచింగ్ అసిస్టెంట్‌గా అర్హత సాధించింది.

సబ్‌స్టేషన్ల ఎదుట స్థలదాతల ఆందోళన


నేలకొండపల్లి : నర్సింహారావు నుంచి వివరాలు సేకరిస్తున్న ఏఎస్సై

నేలకొండపల్లి/రఘునాథపాలెం: విద్యుత్ సబ్‌స్టేషన్ల స్థలం ఇచ్చిన సమయాన ఉద్యోగావకాశం కల్పిస్తామనే హామీని నెరవేర్చాలంటూ దాతల కుటుంబీకులు డిమాండ్ చేశారు. నేలకొండపల్లి మండలంలోని చెరువుమాధారంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి పదేళ్ల క్రితం రైతు ఆకుల నరసింహారావు-నిఖిల దంపతులు 12 గుంటల భూమిని ఇచ్చారు. ఆ సయయాన సబ్‌స్టేషన్‌లో ఉద్యోగం కల్పిస్తామని అధికారులు చెప్పగా, ఇప్పటికీ హామీ నెరవేరలేదు. దీంతో రైతు దంపతులు శుక్రవారం చంటి పాపతో సబ్‌స్టేషన్ వద్ద నిరసనకు దిగి తాళాలు వేసేందుకు యత్నించగా పోలీసులు చేరుకుని స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇక రఘునాథపాలెం మండలంలోని బాబోజితండా, ఈర్లపూడి సబ్‌స్టేషన్ల వద్ద దాతలు తేజావత్ మహేంద్ర, చలమల ధనమూర్తి ఆందోళనకు దిగారు. విద్యుత్ సరఫరా నిలిపేయడంతో ఏడీఈ సంజీవకుమార్, ఏఈలు ఇందిర, సతీష్ చేరుకుని సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. రఘునాథపాలెం సీఐ శ్రీహరి ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటుచేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కల్లూరు: మండలంలోని తెలగవరంలో శుక్రవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.14,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ షాకీర్, సిబ్బంది యర్రం రాములు, వెంకటేశ్వరాచారి, మంగపతి, నాగరవి, రాజేష్ పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	8,250	7,000
మిర్చి	20,800	14,000
మిర్చి తాలు	12,000	8,000
పత్తి	7,650	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,595

పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

ఆస్తిపన్ను బకాయిల వసూళ్లకు 'ఓటీఎస్'
- ఒకేసారి కడితే 90 శాతం వడ్డీ మాఫీ
- కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో అవకాశం
- ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో వేలాది మందికి ఊరట


సత్తుపల్లి మున్సిపాలిటీ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: పుర, నగరపాలక సంస్థల్లో పేరుకుపోయిన ఆస్తిపన్ను బకాయిలను వసూలు చేసేందుకు ప్రభుత్వం, పురపాలక శాఖ మరోసారి వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)ను తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా ఆస్తిపన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ చేస్తూ పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.దానకిశోర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేలాది మంది బకాయిదారులకు ఊరట కలగనుంది. ఉమ్మడి జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు మధిర, సత్తుపల్లి, వైరా, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. వాటిలో 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు రూ.కోట్ల మేర ఆస్తిపన్ను బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలపై ఏటా నానాటికీ వడ్డీ పెరుగుతూ ఉంటుంది. ఈ మేరకు పన్ను మొత్తం ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 90 శాతం రాయితీ వర్తించనుండటంతో బకాయిదారులు ముందుకొస్తారని భావిస్తున్నారు.

ఈ నెల 31 వరకు గడువు

ఆస్తి పన్ను బకాయిలపై విధించిన వడ్డీలో 90 శాతం రాయితీకి ఆ శాఖ గడువు విధించింది. ఈ నెల 31వ తేదీలోపు చెల్లిస్తేనే బకాయిలపై 10 శాతం వడ్డీ కడితే సరిపోతుంది. పుర, నగర పాలకసంస్థలకు రావాల్సిన బకాయిలను వసూలు చేసుకునేందుకు పురపాలక శాఖ గతంలోనూ రాయితీలను ప్రకటించింది. అయితే ఈసారి బకాయిల వసూళ్లకు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఉన్నతాధికారులు సూచనలు చేస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా బకాయిలు లేకుండా వంద శాతం పన్నులు వసూలు చేసేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను బకాయిల వివరాలు

కార్పొరేషన్ / మున్సిపాలిటీ	అసెస్‌మెంట్లు	బకాయి
ఖమ్మం	35,125	రూ.32.70 కోట్లు
కొత్తగూడెం	23,369	రూ.4.53 కోట్లు
వైరా	7,029	రూ.1.83 కోట్లు
సత్తుపల్లి	1,600	రూ.1.24 కోట్లు
వైరా	7,029	రూ.1.83 కోట్లు
ఇల్లెందు	8,124	రూ.89.79 లక్షలు
మధిర	1,564	రూ.47 లక్షలు
మణుగూరు	7,000	రూ.40 లక్షలు
పాల్వంచ	19,671	రూ.1.56 కోట్లు

లెక్కలు కడుతున్న అధికారులు..

ఆస్తి పన్ను బకాయిలపై విధించిన వడ్డీ రాయితీని ప్రకటించడంతో అధికారులు మున్సిపాలిటీల వారీగా లెక్కలు వేస్తున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను బకాయిలు, వాటికి సంబంధించిన వడ్డీ నమోదై ఉంది. బకాయిదారులు ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తే దానంతట అదే రాయితీతో తీసుకునేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసేశారు. కాగా, బకాయిదారులు చెల్లింపునకు ముందుకొచ్చేలా విస్తృత ప్రచారం మొదలుపెట్టారు. ఆటోలకు మైక్‌లు బిగించి పన్ను చెల్లించాలని వీధివీధిన ప్రచారం చేస్తున్నారు. కాగా, ఉమ్మడి జిల్లాలో ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు ఏడు మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటన్నింట్లో 1,10,511 అసెస్‌మెంట్లకు గాను ఆస్తి పన్ను బకాయి రూ.45.45 కోట్లకు పైగానే పేరుకుపోయింది. అత్యధికంగా ఖమ్మం కార్పొరేషన్‌లో రూ.32.70 కోట్ల బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం వడ్డీపై రాయితీ ప్రకటించిన నేపథ్యాన బకాయిదారులు ముందుకొచ్చేలా అధికారులు నిరంతరం ఉద్యోగులతో సమీక్షలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు.

కేపీఎల్ టోర్నీ విజేత 'మిఠాయి పొట్లం'


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నాయకులు, నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్నఖమ్మం ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) ట్వంటీ–20 క్రికెట్ టోర్నీ శుకవారం ముగిసింది. ఫైనల్స్‌లో మిఠాయిపొట్లం బ్లాస్టార్స్ – బాలాజీ బ్లాస్టర్స్ జట్లు తలపడగా మిఠాయిపొట్లం జట్టు విజేతగా నిలిచింది. అనంతరం విజేత, రన్నరప్ జట్లకు కాంగ్రెస్ జిల్లా నాయకులు తుమ్మల యుగంధర్, వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కేపీఎల్ అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్ నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఈకార్యక్రమంలో వత్సవాయి రవి, కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, ఎం.డీ.మతిన్, ఓలేటి సాంబమూర్తి, నరేష్, వెంకట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ ప్రిన్సిపాల్‌కు అవార్డు


ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, ఉద్యోగులు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జకీరుల్లాకు దుబాయ్‌కు చెందిన జెనిసిస్ అల్టిమా సంస్థ, ఇండియన్ సాలిడారిటీ కౌన్సిల్‌తో కలిసి ఇంటర్నేషనల్ షైనింగ్ అవార్డు ప్రకటించింది. ఇటీవల దుబాయ్‌లో జరిగిన సమావేశంలో ఆయన అవార్డు స్వీకరించగా, శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ జకీరుల్లాను అధ్యాపకులు, ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్య, పరిశోధన, అరబిక్ స్టడీస్, పరిపాలనకు సంబంధించిన అంశాల్లో అసాధారణ ప్రతిభ చూపిన ప్రిన్సిపాల్ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ అధ్యాపకులు డాక్టర్ బి.వెంకన్న, డాక్టర్ ఎస్.గోపి, డాక్టర్ ఆర్.సీ తారామారావు, డాక్టర్ జర్పుల రమేశ్, డాక్టర్ సీహెచ్.శ్రీనివాసులు, ఎ.సాంబశివరావు, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆ అధికారి ఉంటే పనిచేయలేం..

- పర్సంటేజీ ఇవ్వనిదే ఫైల్ తీయడం లేదు
- సింగరేణి ఉన్నతాధికారులకు బొగ్గు టిప్పర్ కాంట్రాక్టర్ల ఫిర్యాదు

సత్తుపల్లి: సింగరేణి సంస్థలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఓ అధికారి కొర్రీలు పెట్టి వేధిస్తుండడమే కాక బిల్లుల మంజూరులో ఇబ్బంది పెడుతున్నాడని బొగ్గు టిప్పర్ కాంట్రాక్టర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం కలకలం రేపుతోంది. ఆ అధికారి ఒకేచోట రెండు హోదాల్లో పదేళ్లుగా పనిచేస్తూ.. అన్ని ఓసీలపై పెత్తనం చేస్తూ పర్సంటేజీ లేనిదే బిల్లులు విడుదల చేయడం లేదని వారు ఆరోపిస్తున్నారు. సదరు అధికారి మాట వినకపోతే కొర్రీలు పెట్టి నెలల తరబడి బిల్లులు రానివ్వడనే భయంతో ఇంతకాలం నోరు మెదపలేదన్నారు. కానీ ఇప్పుడు కాంట్రాక్ట్ పోయినా సరే ఆత్మాభిమానం వదులుకోలేక ఫిర్యాదు చేయాల్సి వచ్చిందని ఓ కాంట్రాక్టర్ వాపోయాడు.

రోడ్డు వేయకుండానే...

సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీ నుంచి జేవీఆర్ సైలో బంకర్‌కు 5.4 కిలోమీటర్ల మేర బొగ్గు రవాణా చేసేందుకు టన్నుకు రూ.6.90 చెల్లించేలా టెండర్ పిలిచారు. అయితే ఆ మార్గంలో సీసీ రోడ్డు వేస్తామని చెప్పినా అమలుకాలేదని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. తద్వారా మట్టి రహదారి కావడంతో గోతుల కారణంగా టిప్పర్లు దెబ్బతినడమే కాక అదనంగా కిలోమీటర్ మేర చుట్టూ పది నెలల పాటు టిప్పర్లు తిప్పడంతో డీజిల్ వ్యయం పెరిగిందని చెప్పినా పట్టించుకోలేదని ట్రాన్స్‌పోర్టర్ల ప్రతినిధి వాపోయారు. రోడ్డు వేయాల్సిన బాధ్యత నుంచి తప్పుకోవడం వల్లే టిప్పర్లు దెబ్బతిన్నాయని, పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇక బొగ్గు గనుల విస్తరణకు భూములు ఇచ్చిన పలువురు ఉపాధి కోసం ఫైనాన్స్‌లో టిప్పర్లు కొనుగోలు చేసి సింగరేణి సంస్థలో అద్దెకు పెట్టారు. అయితే, రూ.లక్షల బిల్లులు నిలిపివేసి మానసిక వేధింపులకు గురిచేస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని భూనిర్వాసిత రైతులు, బొగ్గు టిప్పర్ల యజమానులు కోరుతున్నారు.

అవేవీ నిజం కాదు...

ఆరోపణలు ఎదుర్కొన్న సదరు అధికారిని వివరణ కోరగా రోడ్డు వేయాల్సిన బాధ్యత తమదేనని తెలిపారు. దీనిపై టెండర్లు పిలిచామని చెప్పారు. అయితే, మిగతా ఆరోపణల్లో నిజం లేదని స్పష్టం చేశారు. తప్పుడు ఆరోపణలు చేసేవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని తెలిపారు.

ఒకటి, రెండు కాదు.. మూడు !


బానోతు స్పందన


చిలుకా పుష్పలత

ఏన్కూరు/బోనకల్/కూసుమంచి: నిరంతరం శ్రమిస్తే తప్ప ఈ పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించడం సాధ్యం కాదు. కానీ ఒకే దఫా మూడేసి ఉద్యోగాలు సాధించిన యువతులు సత్తా చాటారు. ఏన్కూరు మండలం భగవాన్‌నాయక్ తండ గ్రామానికి చెందిన బానోతు సీతారాములు, స్వాతి దంపతుల కుమార్తె స్పందన ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. చింతకానిలోని కేజీబీవీలో పీజీటీగా పనిచేస్తున్న ఆమె ప్రభుత్వం ఇటీవల వెలువరించిన పీజీటీ, జేఎల్, డీఎల్ ఉద్యోగులు సాధించింది. కాగా, స్పందన 1నుండి 10వ తరగతి వరకు ఏన్కూరు ఉషోదయ ఉన్నత పాఠశాలలో, డిగ్రీ ఖమ్మం ప్రియదర్శిని కళాశాలలో చదివాక ఓయూలో పీజీ పూర్తిచేసింది. ఇక బోనకల్ మండలంలోని జానకీపురానికి చెందిన చిలుకా నాగభూషణం కుమార్తె పుష్పలత సైతం మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. ఇటీవల ప్రభుత్వం గురుకుల సొసైటీ ఉద్యోగ పరీక్షల ఫలితాలు వెల్లడించగా పీజీటీ, జేఎల్, డీఎల్ ఉద్యోగాలకు ఎంపికైన ఆమెను గ్రామస్తులు అభినందించారు. ఇక కూసుమంచి మండలం మల్లేపల్లికి చెందిన ముప్పారపు సీతారాములు, పద్మ కుండల తయారీతో జీవనం సాగించినా కుమార్తె ఉమను కష్టపడి చదివించారు. ఆతర్వాత ఆమెకు పెళ్లయి కుమారుడు ఉన్నా శ్రద్ధగా సిద్ధమై ఏకంగా మూడు ఉద్యోగులు సాధించింది. పీజీటీ, జేఎల్, డీఎల్ ఉద్యోగాలకు ఎంపిక కాగా డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాన్ని ఎంపిక చేసుకున్నట్లు ఉమ తెలిపింది.


నియామక పత్రం అందుకుంటున్న ఉమ

రెండు ఉద్యోగాలు...


చిన్నోజి ప్రసన్న

చింతకాని: మండలంలోని నేరడకు చెందిన చిన్నోజి ప్రసన్న రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆమె కేజీబీవీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తూనే గురుకుల డిగ్రీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించడంపై పలువురు అభినందించారు.

వరిగడ్డి వామి దగ్ధం

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి గండగలపాడులో ప్రమాదశాత్తు వరిగడ్డి వామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు గుజ్జ వెంకటేశ్వర్లు సుమారు నాలున్నర ఎకరాల వరిగడ్డిని ఇంటి ఆవరణలోని వామి వేశాడు. అదే ఇంట్లో నివాసముంటున్న మరో రైతు శుక్రవారం ట్రాక్టర్‌ను యూ టర్న్ చేసి ఇంటి ముందు ఉన్న షెడ్డులో పెట్టే సమయాన ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో వైర్లు తెగి గడ్డిపై పడగా నిప్పురవ్వలు ఏర్పడి గడ్డి కాలిపోయింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో చేరుకుని అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. కాగా, ఘటనలో సుమారు రూ. 30 వేల విలువైన గడ్డి కాలిపోయినట్లు తెలిసింది.

బంగారు ఆభరణాలు చోరీ

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేట గ్రామపంచాయితీ పరిధి ఇందిరానగర్ కాలనీలో గురువారం రాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాలనీకి చెందిన కట్టా నాగేశ్వరావు తన ఇంట్లో నిద్రిస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బీరువాలో భద్రపర్చిన నాలుగు తులాల బంగారు నెక్లెస్, రెండు తులాల బంగారు గాజులు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన ఆయన చేసిన ఫిర్యాదుతో ఎస్ఐ బాదావత్ రవి విచారణ చేపట్టారు.

ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైర్..

పెనుబల్లి: పెనుబల్లి మండలంలోని తాళ్లపెంట, పెనుబల్లి రాతోని ఎత్తిపోతల పథకం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. మూడు రోజుల క్రితం తాళ్లపెంట పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లో, గురువారం రాత్రి పెనుబల్లి రాతోని ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్‌లో వైర్ చోరీకి గురైంది. ఫ్యూజ్‌లను తొలగించి బోల్ట్‌లు విడదీసి మరీ రాగివైర్ తీసుకెళ్లగా విద్యుత్ శాఖ ఉద్యోగులతో సంబంధాలు ఉన్న వారే కావొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చోరీ అయిన వైర్ విలువ రూ.10 లక్షలకు పైగా ఉండగా ఐబీ జేఈ కిరణ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వీఎం బంజర్ ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

చికెన్ తినాలని కొడుకును చితకబాదిన తండ్రి

భర్తపై ఫిర్యాదు చేసిన భార్య

నేలకొండపల్లి: జ్వరంతో బాధపడుతున్న కుమారుడిని చితకబాదిన తండ్రిపై ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటన వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలంలోని అనాసాగారానికి చెందిన లింగం శ్రీనివాస్–మహేశ్వరి కుమారుడు మురళి(9)కి ఇటీవల జ్వరం రావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం ఊరెళ్లిన శ్రీనివాస్ శుక్రవారం ఇంటికి రాగా.. జ్వరం వచ్చిన కుమారుడిని చికెన్ తినాలని బెల్ట్‌తో చితకబాదాడు. దీంతో మురళికి తీవ్ర గాయాలు కాగా, ఆయన తల్లి చికిత్స చేయించాక భర్త శ్రీనివాస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

భూమి రిజిస్ట్రేషన్ ఆపేయాలని నిరసన

తహసీల్‌లో తండ్రీకొడుకుల ఆందోళన

రఘునాథపాలెం: తమ భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నందున నిలిపివేయాలంటూ తండ్రీకొడుకులు రఘునాథపాలెం తహసీల్‌లో శుక్రవారం నిరసనకు దిగారు. ఈమేరకు నిరసన తెలిపిన మండలంలోని బూడిదంపాడుకు చెందిన దుద్దుకూరి షాజీరావు కథనం ప్రకారం... 2005లో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి మంచుకొండ రెవెన్యూ పరిధిలోని నాలుగు ఎకరాల భూమి కొని రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో పాటు కొత్త పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేశారు. ఇందులో మూడెకరాలకు పాస్ పుస్తకం రాగా, మిగిలిన భూమిని తాను అప్పుగా తీసుకున్న నగదుకు హామీగా గ్రామానికి చెందిన వ్యక్తులకు రాయించి ఇచ్చారు. ఇంతలోనే మొత్తం భూమిని అదే గ్రామానికి చెందిన మోహన్‌రావు తన పేరిట ధరణిలో ఎక్కించుకున్నారని ఆరోపిస్తుండగా, వివాదం న్యాయస్థానంలో ఉండగానే ఆయనకు పాసుపుస్తకం ఇవ్వడంపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇంతలోనే మోహన్‌రావు పాస్‌పుస్తకం ఆధారంగా భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసే యత్నాలు చేయగా విచారణ జరిగే వరకు ఆపాలని కోరినా తహసీల్దార్ పట్టించుకోవడం లేదని షాజీరావు, ఆయన కుమారుడు విద్యాసాగర్ తెలిపారు. భూమిని వేరే వారికి రిజిస్ట్రేషన్ చేస్తే ఆత్మహత్య చేసుకుంటామని చెప్పడంతో పోలీసులు చేరుకుని సర్దిచెప్పారు. ఈ విషయమై రఘునాథపాలెం తహసీల్దార్ విల్సన్ బెన్నీ మాట్లాడుతూ తప్పుడు రిజిస్ట్రేషన్ అనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. గతంలో ఓసారి రిజిస్ట్రేషన్‌ను అడ్డుకోగా, ఆధారాలు తీసుకురావాలని సూచిస్తే కోర్టు నుంచి తీసుకొచ్చారని తెలిపారు. ఈసారి రిజిస్ట్రేషన్‌పై షాజీరావుకు ముందస్తు సమాచారం ఇచ్చినా ఎలాంటి ఆధారాలు లేకుండా ఆందోళనకు చేపట్టారని పేర్కొన్నారు.

అలసి.. సొలసి..







ఓ పక్క మండే ఎండ.. మరోపక్క మిర్చిఘాటు. అయినా అలసిపోయిన రైతులు మిర్చి బస్తాలపైనే నిద్రించారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు పెద్దసంఖ్యలో మిర్చి వస్తుండటంతో త్వరగా కొనుగోళ్లు పూర్తవుతాయనే భావనతో రైతులు అర్ధరాత్రి నుంచే చేరుకుంటున్నారు. ఈ నేపథ్యాన శుక్రవారం ధర విషయమై ఆందోళన జరగగా కొనుగోళ్లు ఆలస్యమయ్యాయి. దీంతో కొందరు రైతులు గంటల తరబడి వేచి ఉండగా.. చేసేదేం లేక మిర్చి బస్తాలపై కునుకు తీయడం కనిపించింది. –స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

తాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


ప్రదర్శనగా వస్తున్న వినోబా కాలనీ వాసులు

ఖమ్మంమయూరి సెంటర్: ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల(వినోబా నవోదయ కాలనీ)లో తాగునీరు, విద్యుత్ సమస్య పరిష్కరించాలని అక్కడి ప్రజలు ఆందోళన చేపట్టారు. గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యాన శుక్రవారం ధర్నా చేయగా పెవిలియన్ మైదానం నుండి మయూరిసెంటర్, వైరారోడ్డు, జెడ్పీసెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా ట్రంక్‌సెంటర్‌లోని కేఎంసీ కార్యాలయానికి ఖాళీ బిందెలతో చేరుకుని ధర్నా చేశారు. తమ ప్రాంతానికి తాగునీరు, కరెంటు, రోడ్లు తదితర సౌకర్యాలు కల్పించాలని హైకోర్టు ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ యర్రయ్య, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ(ఓడీపీఆర్) నాయకులు దండా లింగయ్య, పోలెబోయిన ముత్తయ్య, బాణాల లక్ష్మణాచారి, కల్తీ రామచంద్రయ్య, తాళ్లూరి కృష్ణ, కల్తీ లెనిన్, జంగం రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.